షాదీఖానా నిర్మాణానికి నిధులు విడుదల

- ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్
- నాల్గవ వార్డులో ముగిసిన గడప గడపకు మన ప్రభుత్వం


మహిళలకు ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిఅర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇటీవల తెనాలి సభలో ఇచ్చిన హామీ మేరకు పట్టణంలో నూతనంగా నిర్మించనున్న షాదీఖానాకు నిధులు విడుదల చేశారని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వెల్లడించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నాల్గవ వార్డు బీసీ కాలనీ నుంచి శనివారం సాయంత్రం ప్రారంభించారు. వైఎస్సార్ సీపీ నాయకులు అడుసుమల్లి శ్రీనివాస రావు ఆధ్వర్యంలో వార్డు నాయకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ తెనాలి పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దనున్నట్లు ప్రకటించారు. ఎన్నికల సమయంలో ముస్లిం మైనార్టీలకు మున్సిపల్ చైర్మన్ పదవి ఇవ్వడం, వారి కోసం షాదీఖానా తెనాలిలో నిర్మిస్తానని హామీ ఇచ్చినట్లు గుర్తుచేశారు. వాటిలో ఇప్పటికే మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ముస్లిం మైనార్టీలను నియమించినట్లు చెప్పారు. రెండో హామీ అయిన షాదీఖానా ప్రోగ్రెస్‌లో ఉందని చెప్పారు. దానిని కూడా త్వరలో నిర్మించనున్నట్లు ప్రకటించారు. తెనాలి పట్టణంలో పాడైన మున్సిపల్ కార్యాలయాన్ని పడగొట్టి కొత్తది నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు విడుదల చేయనున్నదని తెలిపారు. వారంలో నిధులు కూడా విడుదల అయ్యే అవకాశం ఉందన్నారు. వార్డులో ప్రజలు తెలియజేసిన గ్రీవెన్స్‌ను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా రెండు సచివాలయాలకు వచ్చే రూ.40 లక్షలతో పరిష్కరించనున్నట్లు చెప్పారు. సీఎం జగన్ పాలనలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలిపారు. 2019 ఎన్నికల కంటే వైఎస్సార్ సీపీకి ఎక్కువ మెజార్టీ వచ్చే అవకాశం ఉందనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సయ్యద్ ఖలేదా నసీమ్, వైస్ చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్, మాజీ వైస్ చైర్మన్ గంటూరు కోటేశ్వరరావు, కౌన్సిలర్లు యాతాటి అనిల్, తోట రఘురామ్, కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, మార్కెట్ యార్డు డైరెక్టర్ తులసీ భగవాన్, వార్డు నాయకులు దేసు శ్రీనివాసరావు, రెడ్డి రమణమ్మ, దుర్గాప్రసాద్, నాని, సుభాని, ఇందిరా ప్రియదర్శిని చిరంజీవి, రాఘవ, కోటేశ్వరరావు, సుశీలరావు, వినోద్, వీరనాథ్, పండు, వైఎస్సార్‌సీపీ నాయకులు కఠారి హరీష్, కాళిదాసు వెంకటసత్యం, అక్కిదాసు కిరణ్‌కుమార్, కుర్రా శ్రీను, మీరావలి, షేక్ గఫూర్, కుక్కల ముక్తేశ్వరరావు, బొమ్ము నాగిరెడ్డి, తాడిబోయిన రమేష్, కోలా వాసు, కొడాలి క్రాంతి, సాయిబాబా మాస్టారు, గుంటూరు కృష్ణ, మల్లిబోయిన రాము, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, గ్యాస్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహారం పంపిణీ



తెనాలిఅర్బన్: వరల్డ్ హ్యూమన్ రైట్స్ ఇంటర్నేషనల్ మెంబర్ డాక్టర్ ఎం.ప్రభుదాసు ఆధ్వర్యంలో క్షయవ్యాధిగ్రస్తులకు శనివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టీడీ యూనిట్ వైద్యాధికారి డాక్టర్ జీవనలత మాట్లాడుతూ క్షయవ్యాధి నియంత్రణకు ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సమత ఫ్రెండ్స్ అధ్యక్షుడు జీవీ నారాయణ ఆధ్వర్యంలో రోగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్ బేబిజాన్, సూపర్‌వైజర్ పి.రవికుమార్, హెల్త్ విజిటర్‌లు వి.దిలీప్‌కుమార్, కె.భార్గవి, వనజ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



తెనాలిఅర్బన్: నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సీపీఐ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల కోసం నిరంతరం పోరాడే లెఫ్ట్ పార్టీలు, విద్యార్థి సంఘాలు, యువజన సంఘాల స్వేచ్ఛను జీవో నంబరు 1 హరిస్తోందని ఆరోపించారు. దానిపై ప్రభుత్వం పునరాలోచన చేసి దానిని రద్దు చేయాలని కోరారు. సీపీఐ పట్టణ కార్యదర్శి మద్దినేని కిరణ్ మాట్లాడుతూ భగత్‌సింగ్ విగ్రహాల చుట్టూ ఉన్న ఫ్లెక్సీలను తొలగించాలని కోరారు. సమావేశంలో ఏఐవైఎఫ్ కార్యదర్శి పల్నాటి నాగరాజు, ఏఐవైఎఫ్ నాయకులు మన్నం కొండ, బిళ్ల రాజేష్, కె.గోపి, కనూరి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సినిమాల్లో ప్రబోధ గీతాలపై చర్చ



తెనాలి: పట్టణంలో జరుగుతున్న విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీ రామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో ఈ వారం ప్రదర్శించిన ఎన్టీఆర్ ఉచిత సినిమాలపై సమీక్ష, ఎన్టీఆర్ వ్యక్తిత్వంపై చర్చ నిర్వహించారు. ప్రముఖ రంగస్థల కళాకారుడు, గాయకుడు వేమవరపు లక్ష్మీనరసింహారావును సత్కరించి జ్ఞాపికను అందజేశారు. వెంపటి సత్యనారాయణ, మహమ్మద్ ఖుద్దూస్ ఎన్టీఆర్ చిత్రాల్లోని ప్రబోధ గీతాలు అనే అంశంపై ప్రసంగించారు. కళాకారుడు లక్ష్మీనరసింహారావుతో పాటు వీరిద్దరిని సత్కరించారు. విష్ణుమొలకల భీమేశ్వరప్రసాద్, దేవరపల్లి భవాని, ఎన్టీఆర్ జగన్, ముప్పానేని రాఘవరావు, దేవిశెట్టి భాస్కర్, అప్పల కిషోర్, కొండముది రమేష్, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ హితైషి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి

బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.367 కోట్ల కేటాయింపుపై హర్షం


పురుషోత్తమశర్మ

తెనాలి: రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బ్రాహ్మణ కార్పొరేషన్‌కు రూ.367 కోట్లు కేటాయించడంపై రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య కోశాధికారి పోతావఝుల పురుషోత్తమశర్మ శనివారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలియజేశారు. అన్ని దేవాలయాల ట్రస్ట్ బోర్డు సభ్యుల్లో ఒక బ్రాహ్మణుడు ఉండాలని తీసుకున్న నిర్ణయంపై రాష్ట్ర బ్రాహ్మణ్యం యావత్తూ ముఖ్యమంత్రి నిర్ణయంపై ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నట్టు తెలిపారు. స్వాతంత్ర్య భారతదేశంలో మరే ముఖ్యమంత్రి చేయని విధంగా పరమపవిత్ర ఉగాది పర్వదినాన ప్రతి జిల్లాలో, ఆదాయం అధికంగా ఉన్న దేవాలయాల్లో 62 ఏళ్లు నిండిన వేదపండితుడికి, ఇద్దరు పురోహితులకు రూ.10,116 చొప్పున పారితోషికం ఇచ్చి గౌరవించడం గర్వించదగిన అంశమన్నారు. ఉగాదిన వేదపండితుల్ని, పురోహితుల్ని సత్కరిస్తున్న సీఎంకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా అన్నమాచార్యులు 520వ ఆరాధన


మహాత్మా ఆశ్రమంలో అన్నదానం చేస్తున్న బాలస్వామీజీ

తెనాలిటౌన్: తాళ్లపాక అన్నమాచార్యులు 520వ ఆరాధన మహోత్సవాలను పట్టణంలోని ఆశ్రమాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మా ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు ఆశ్రమం, గాంధీనగర్‌లోని షిరిడీసాయి వృద్ధాశ్రమంలో ప్రముఖ ఆధ్యాత్మిక గాయకురాలు కొండవీటి జ్యోతిర్మయి ఆదేశానుసారంగా శ్రీవిద్యాపీఠం నిర్వాహకులు బాలస్వామీజీ ముఖ్య అతిథిగా పాల్గొని అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు. బాలస్వామీజీ మాట్లాడుతూ తొలి తెలుగు వాగ్గేయకారుడు, పదకవితా పితామహుడు అన్నమాచార్యులు 32 వేల కీర్తనలు రచించారని, వాటి విశిష్టతను తెలియజేశారు. కార్యక్రమంలో సాలిగ్రామ మఠం ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ ఎం.రమణయ్య, గోపు రామకృష్ణ, లోకనాథం, తటవర్తి శివరామకృష్ణ, సువర్ణకుమారి, ఆశ్రమాల నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, భారతి, మురళి, సత్యనారాయణ పాల్గొన్నారు.

రేపటి నుంచి నవరాత్రి మహోత్సవాలు

తెనాలి రూరల్: పెదరావూరు గ్రామంలోని సుబ్రహ్మణ్యపురం మహావిద్యాపీఠంలో గల అభయహస్త సుబ్రహ్మణ్య క్షేత్రంలో ఈ నెల 20వ తేదీ నుంచి వసంత నవరాత్రి మహోత్సవాలు నిర్వహించనున్నారు. 21 నుంచి 31వ తేదీ వరకు ప్రతి రోజు మహాత్రిపురసుందరీ సమేత చంద్రమౌళీశ్వరస్వామి త్రికాల పీఠార్చనలు, విశేష పూజ, హోమాలు, వేద సభలు జరుగనున్నాయి. కంచి పీఠాధిపతి శంకర విజయేంద్ర సరస్వతి మహాస్వామి ఈ ఉత్సవాల్లో ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. 21 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు సుబ్రహ్మణ్యపురంలోనే ఉండి ప్రతి రోజు భక్తులకు అనుగ్రహ భాషణ చేస్తారు. ఉగాది రోజున ప్రత్యేక దర్శనం, అనుగ్రహ భాషణం ఉంటుంది. 30వ తేదీ శ్రీరామనవమి సందర్భంగా సీతారామ దివ్య కల్యాణ మహోత్సవం జరుగుతుంది. 31వ తేదీ శ్రీరామ పట్టాభిషేకం జరుగుతుంది. నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ప్రతి రోజు మధ్యాహ్నం 12 నుంచి 2 గంటల వరకు అన్న సంతర్పణ జరుగుతుందని విద్యాపీఠం కార్యవర్గ సభ్యులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

సబ్‌పోస్టాఫీస్ ఆకస్మిక తనిఖీ


తనిఖీ చేస్తున్న హరిప్రసాద్, బృందం

తెనాలి: ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్) జి.హరిప్రసాద్, శనివారం తన బృందంతో కలిసి పట్టణ మారీసుపేటలోగల సబ్‌పోస్టాఫీసును ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పోస్టాఫీసు కార్యకలాపాలను నిశితంగా పరిశీలించారు. వ్యత్యాసాలుంటే గుర్తించడం, వ్యాపారాన్ని మెరుగయ్యే అవకాశం ఉన్న ప్రాంతాలు, ఖాతాదారులను గుర్తించడం లక్ష్యంగా ఈ తనిఖీ కొనసాగింది. ఆర్థిక రికార్డులను సమీక్షించారు. రోజువారీ కార్యకలాపాలు, సవాళ్లపై అవగాహనకు పోస్టాఫీసు సిబ్బంది, కొందరు ఖాతాదారులతో సంభాషించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోస్టల్ సర్వీసుల్లో పారదర్శకత, జవాబుదారీతనం అత్యున్నత ప్రమాణాలను నిర్ధారించడానికి తాము కట్టుబడి ఉన్నట్టు చెప్పారు. ఖాతాలు, లావాదేవీల స్థితిని సమీక్షించడానికి, సేవల మెరుగుకు బృంద తనిఖీ ఒక ముఖ్యమైన సాధనమన్నారు. మారీసుపేట పోస్టాఫీసు సిబ్బంది అంకితభావం, కృషిని ప్రశంసించారు. ప్రజలకు చక్కని సేవలను అందించటం కొనసాగించాలని సూచించారు. లావాదేవీలకు సంబంధించి ఎస్ఎంఎస్ పొందడానికి, ఖాతాల్లో అవకతవకల నివారణకు ఖాతాదారులంతా తమ ప్రస్తుత ఖాతాలన్నింటిలో వారి మొబైల్ నంబరును అప్‌డేట్ చేయాలని సలహానిచ్చారు. పోస్టల్ సేవల నాణ్యత, సామర్థ్యం మెరుగుపరిచేందుకు ఆంధ్రప్రదేశ్ పోస్టల్ సర్కిల్ చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే బృంద తనిఖీలు జరుగుతున్నాయని వివరించారు.

చిరు వ్యాపారికి తోపుడు బండి అందజేత



తాడేపల్లి రూరల్: మంగళగిరి రూరల్ పరిధిలోని పెదవడ్లపూడిలో చిరు వ్యాపారం చేసుకునే మహిళకు శనివారం విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తోపుడు బండిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ అధ్యక్షురాలు కాగితాల స్వాతి మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం ఈసీ మెంబర్ కోవెలకారు శివరాం బాబూజీ ఆర్థిక సహాయంతో తోపుడు బండిని అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ట్రెజరర్ బొట్టేటి రమేష్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ జాయింట్ సెక్రటరీ తిరువీధుల కిరణ్, దుగ్గిరాల మండల అధ్యక్షురాలు మాధు నాగదుర్గ పాల్గొన్నారు.

ఉర్దూ బోధనలో శ్రద్ధ అవసరం



ఫిరంగిపురం: మండలంలోని మేరికపూడి మండల పరిషత్ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను డీఐ ఎండీ. ఖాసిం శనివారం తనిఖీ చేశారు. విద్యార్థుల వర్క్ పుస్తకాలు పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలు పరిశీలించి, వారితో బోర్డుపై పలు అంశాలు రాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులంతా ఉర్దూ భాష చక్కగా చదవడం, రాయడంపై ఉపాధ్యాయులు తగిన శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఎఫ్ ఏ–4 మార్కులను ఈనెల 22లోపు విద్యాశాఖ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఆధార్, బ్యాంకు వివరాలు పొందుపర్చాలని తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయులు నాగుల్‌మీరా, స్వప్న ఉన్నారు.

క్షయ బాధితులకు పోషకాహార కిట్స్ పంపిణీ


కిట్స్ పంపిణీ చేస్తున్న రాష్ట్ర టీబీ కంట్రోలర్ ఆఫీసర్ రమేష్

తాడేపల్లి రూరల్: మంగళగిరి గణపతినగర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లో శనివారం ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఎంటీడీటీసీ డాక్టర్ బి. లక్ష్మణ్ నాయక్ ఆదేశాల మేరకు క్షయవ్యాధిగ్రస్తులకు పోషకాహార కిట్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర టీబీ కంట్రోలర్ ఆఫీసర్ డాక్టర్ టి. రమేష్ మాట్లాడుతూ వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడుతూ, పోషకాహారం తీసుకోవడం ద్వారా త్వరగా కోలుకుంటారని సూచించారు. జిల్లా లెప్రసీ, ఎయిడ్స్ అంగ్ టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ బండారు సుబ్బారావు మాట్లాడుతూ 2125 మంది మందులు వాడుతున్నారని తెలిపారు. ఇందులో 1200 మంది రోగులకు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అమరావతి సర్కిల్ కనెక్ట్ – టు – ఆంధ్ర ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ ప్రోత్సాహంతో ఆరు నెలల పాటు పోషకాహారం అందించేందుకు అంగీకరించిందని వివరించారు. అనంతరం రోగులకు పోషకాహార కిట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మంగళగిరి ఏరియా రీజనల్ మేనేజర్ పి. ఈశ్వరరావు, హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి పి. అనూష, టీబీ యూనిట్ వైద్యాధికారి కిరణ్ కుమార్, జిల్లా టీబీ విభాగం పీపీఎం వి. రాజశేఖర్, డెప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ డి. జోసఫ్, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

మిర్చి రైతులు జాగ్రత్తలు పాటించాలి

ఫిరంగిపురం: మిర్చి రైతులంతా కల్లాల్లో కాయలకు వర్షాల వల్ల నష్టం కలగకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని ఏవో రమణకుమార్ సూచించారు. కాయలు తడవకుండా పైన టార్పాలిన్ పట్టాలు కప్పాలని తెలిపారు. కాయలకు కుళ్లు రాకుండా మాంకోజెట్ (లీటర్‌కు 2.5 గ్రాములు) లేదా క్లోరోథలోనిల్ (లీటర్‌కు 2 గ్రాములు) లేదా థయోఫినైట్ మిథెల్ (లీటర్‌కి 2 గ్రాములు) కలిపి పిచికారీ చేయాలని సూచించారు. తెగులు ఉధృతి నివారించడానికి డైఫిన్ కొనజోల్ (0.5) మి.లీ. పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ఏప్రిల్ 9న చలో ఢిల్లీ పిలుపునకు మద్దతు


కొల్లిపరలో పంచాయతీ కార్మికులతో మాట్లాడుతున్న శివసాంబిరెడ్డి

తెనాలిటౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక, రైతు వ్యతిరేక చట్టాలను రద్దు చేయాలని కోరుతూ ఏప్రిల్ 9న జరిగే చలో ఢిల్లీ పిలుపుకు మద్దతు ఇవ్వాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. మండల కేంద్రమైన కొల్లిపరలో సీఐటీయూ మండల కార్యదర్శి కోట చంద్రశేఖర్‌తో కలిసి పంచాయతీ కార్మికులు, రైతులు, కౌలు రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి పెట్టుబడిదారులకు అనుకూలంగా మోదీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను తెచ్చిన సంగతి గుర్తుచేశారు. పండించిన పంటకు కనీస మద్దతు ధర చట్టం తీసుకువస్తామని చేసిన వాగ్దానాన్ని తుంగలో తొక్కి రైతులకు అన్యాయం చేశారని తెలిపారు. కార్మికులు, కర్షకులు ఐక్యంగా ఉండి మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు మల్లోల రమేష్, గోదా ఏసుపాదం, కొల్లిపర కోటయ్య, సుందరరావు, దీనమ్మ, సీతమ్మ, మరియమ్మ, పిచ్చయ్య, నవాక్, ఏసుపాదం, నాగేంద్రం, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రక్త క్యాన్సర్‌పై విద్యార్థులకు అవగాహన


పేర్లు నమోదు చేయించుకుంటున్న కేఎల్‌యూ విద్యార్థులు

తాడేపల్లి రూరల్ : వడ్డేశ్వరం కె.ఎల్. విశ్వవిద్యాలయంలో రక్త క్యాన్సర్‌పై శనివారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చక్రవర్తి మాట్లాడుతూ భారతదేశంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక వ్యక్తి బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారని తెలిపారు. బ్లడ్ డిజార్డర్స్, లైఫ్ సేవర్స్ అవసరాలపై విద్యార్థులకు అవగాహన అవసరమని చెప్పారు. రిక్రూట్‌మెంట్ డోనర్, డెప్యూటీ మేనేజర్ ప్రజీత్ సుధాకర్, అసోసియేట్ డోనర్ రిక్రూట్‌మెంట్ అషిత, జె. కృత్తికలు ముఖ్య అతిథిలుగా హాజరై, విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. అనంతరం పలువురు విద్యార్థులు క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు రక్తాన్ని ఇవ్వడానికి ముందుకు వచ్చారు. కార్యక్రమంలో వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథివర్మ, ప్రో వీసీ డాక్టర్ ఎన్. వెంకటరామ్, రిజిస్ట్రార్ ఎ. జగదీష్, సీఎస్ఆర్ విశ్రాంత శాస్త్రవేత్త బాపూజీ, హబీ క్లబ్ అధ్యాపకులు డాక్టర్ శుభాకర్‌రాజు, సాక్ డైరెక్టర్ పి. విజయ్‌సాయి, డాక్టర్ బుచ్చి, ఫార్మసీ విభాగ అధ్యాపకులు డాక్టర్ కె. సుకీర్తి, డాక్టర్ పి. లోకేశ్వరి, డాక్టర్ నరేష్, సేఫ్ లైఫ్ సభ్యులు వెంకట్ కళ్యాణ్, మహమ్మద్ నూర్, మహాలక్ష్మి పాల్గొన్నారు.

నేడు సప్తగిరి సంకీర్తనోత్సవం

తెనాలి: తాళ్లపాక అన్నమాచార్యుల 520వ ఆరాధన సందర్భంగా తెనాలిలోని శ్రీవేంకటేశ్వర అన్నమాచార్యుల సంకీర్తన బృందం ఆధ్వర్యంలో ఆదివారం 'సప్తగిరి సంకీర్తనోత్సవం' నిర్వహించనున్నారు. స్థానిక కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రమ్‌లో సాయంత్రం 5 గంటల్నుంచి రాత్రి 9 గంటల వరకు 200 మంది స్థానిక కళాకారులతో అన్నమయ్య సంకీర్తన గానం జరుగుతుందని కన్వీనర్ కొండపి శ్రీనివాసరావు చెప్పారు. కళాక్షేత్రం ఆవరణలో శనివారం విలేకరుల సమావేశంలో వివరాలను తెలియజేశారు. పొత్తూరి వెంకట ఆదిలక్ష్మి, కంకిపాటి పద్మావతి, గౌరావఝుల ఆంజనేయశాస్త్రి, కొండపి వసుంధర, ఎల్లాప్రగడ జానకి, అద్దేపల్లి శివసుధీర్ నేరెళ్ల కళ్యాణి, వఝుల లక్ష్మీసునీత, వి.సుజాత, మూర్తి అనూరాధ, సాల్లేటి శైలజ, చుండూరు ఆదిలక్ష్మి, నందిరాజు ప్రసూన బృందాలు సంకీర్తన గానం చేస్తారని వివరించారు. అనంతరం 100 మంది చిన్నారులతో గోవిందనామ సంకీర్తనాగానం, గురువులకు సత్కారం ఉంటాయని తెలిపారు. సంగీత, సంకీర్తన అభిమానులు కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. వీరివెంట లక్కరాజు లక్ష్మణరావు, కానూరు వెంకట రామకృష్ణ, పరుచూరి సుబ్బారావు ఉన్నారు.

లారీ ఢీకొని యువకుడికి తీవ్రగాయాలు

తెనాలిరూరల్: లారీ ఢీకొని యువకుడు తీవ్ర గాయాలపాలైన ఘటన తెనాలి మండలం నందివెలుగు వద్ద శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొల్లిపర మండలం కుంచవరం గ్రామానికి చెందిన బేతపూడి రాజేష్‌ఖన్నా బైక్‌పై నందివెలుగు వైపు వెళుతుండగా నందివెలుగు శివారులో ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108లో గుంటూరు సమగ్ర ప్రభుత్వ వైద్యశాలకు పంపారు. లారీ డ్రైవర్ వాహనాన్ని వదిలి పరారయ్యాడు. రూరల్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి రెండు వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తాడేపల్లి రూరల్: విజయవాడ నగరంలోని కనకదుర్గ వారధిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. తాడేపల్లి యస్ఐ వినోద్ తెలిపిన వివరాల ప్రకారం... తాడేపల్లికి చెందిన బొమ్మిశెట్టి హరికిరణ్ స్నేహితులతో కలసి కారులో కనకదుర్గ వారధిపై విజయవాడ వెళుతుండగా వెనుక నుంచి లారీ వచ్చి ఢీకొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ సమయంలో కారు నడిపే వ్యక్తితో పాటు ముందు సీట్లో ఒకరు, వెనుక సీట్లో బొమ్మశెట్టి హరికిరణ్ కూర్చుని ఉన్నారు. ప్రమాదంలో ఆయన ఎడమ చేయి విరిగింది. హరికిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు యస్ఐ వినోద్ తెలిపారు.